


8లో..

బ్రహ్మచారిణి అలంకరణలో అమ్మవారు

రెండో రోజుకు చేరిన దేవి శరన్నవరాత్రులు

# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 23
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
అక్టోబర్ 04, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


వైన్ షాప్ ల అండతో బెల్ట్ షాప్ ల దందా మూడు పుల్లు.. ఆరు బీర్లు అన్నట్టుగా మారింది. దసరా పండుగ సీజన్ కావడంతో వైన్ షాపుల యజమానులు మద్యం బ్రాండ్లపై రేట్లు పెంచి బెల్ట్ షాపులకు అందిస్తే వారు మరింత ధర పెంచి మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారు. అధిక కమీషన్ రావడంతో వైన్ షాపుల్లో దొరకని బ్రాండ్లు సైతం బెల్టు షాపుల్లో అమ్ముతున్నారంటే ఈ దందా ఎంతలా కొనసాగుతుందో అర్థమవుతోంది. ప్రభుత్వ టార్గెట్ లను పూర్తి చేయడంతో పాటు అందిన కాడికి దండుకోవాలన్న లక్ష్యంతో వైన్ షాపులు యజమాన్యం బెల్ట్ షాపుల వ్యవస్థను ప్రోత్సహిస్తూ గ్రామాలను మద్యం మత్తులో ముంచుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీ, నాలీ పనులు చేసుకునే కుటుంబాలు మద్యం వ్యసనంతో ఆగమాగమవుతుంటే మద్యం అమ్ముతున్న వారు బిల్డింగుల మీద బిల్డింగులు కడుతున్నారు. ఒక్క సారి టెండర్ వస్తే చాలు జీవితకాలం కావాల్సినంత సంపాదించుకోవచ్చన్న ఉద్దేశ్యంతో వైన్ షాప్ యజమానులు అక్రమాలకు సైతం తెర తీస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తూ కాలం గడుపుతున్నారన్న విమర్శలున్నాయి.

– వరంగల్ వాయిస్, కమలాపూర్

# వైన్ షాపుల అండ..
# బెల్టుషాపుల దందా




- చోద్యం చూస్తున్న అధికారులు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- దసరా పండుగే టార్గెట్ గా అక్రమాలు
- ఎమ్మార్పీ కన్న రూ.30 అధికంగా వసూలు
- ఒక్కో బీరు పై రూ. 50 వసూలు
- మద్యం ప్రియుల జేబులకు చిల్లు
- కృత్రిమ కొరతతో అధిక డిమాండ్

వివరాలు2లో..



2లో..

## పేదల సంక్షేమానికి పెద్ద పీట

- దసరాలోపు అర్హులందరికీ హెల్త్ కార్డ్, రేషన్ కార్డులు
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం



2లో..

## చేపల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ

- మత్స్య కార్మికులను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..

## ఫిల్టర్ బెడ్ లో మేయర్ ఆకస్మిక తనిఖీ

- అవాంతరాలు లేకుండా నీటిని సరఫరా చేయాలంటూ సూచన

# వైన్ షాపుల అండ..
# బెల్ట్ షాపుల దందా







- చోద్యం చూస్తున్న అధికారులు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- దసరా పండుగే టార్గెట్ గా అక్రమాలు

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కమలాపూర్ లో మద్యం ఏరులై పారుతోంది. మండలం పరిధిలో ఆరు వైన్ షాపులు ఉన్నాయి. ఒక్కో వైన్ షాప్ నాలుగు గ్రామాల చొప్పున పంచుకొని దర్జాగా ఆటోలో మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఎమ్మార్పీ రేటు మీద క్వాటర్ కు రూ.20, ఆఫ్ కు రూ.40, ఫుల్ కు రూ.100 అధికంగా తీసుకుని బెల్ట్ షాపులకు మందు సరఫరా చేస్తున్నారు. అలా తీసుకెళ్లిన మద్యాన్ని గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో ఎమ్మార్పీ కన్నా రూ.30 అధికంగా తీసుకొని విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యుడిపై పెను భారం పడుతోంది. ఇక బీర్ల విషయానికి వస్తే ఒక్కో బీరుకు దాదాపు రూ.50 ఎక్కువగా వసూలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బీర్లు షార్టేజ్ ఉంటే ఇక వారు చెప్పిందే రేటు అన్నట్లుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా వైన్ షాప్ సిండికేట్ దందా కమలాపూర్ మండలంలో విచ్చలవిడిగా కొనసాగుతోంది.

### చోద్యం చూస్తున్న అధికారులు..

వైన్ షాపులు సిండికేట్ గా ఏర్పడి విచ్చలవిడిగా మద్యం దందా కొనసాగిస్తుంటే అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. వైన్ షాపులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తుంటే నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక గ్రామాల్లో సైతం బెల్ట్ షాపులపై నిత్యం దాడులు చేయాల్సిన అధికారులు ఎందుకు ఈ దందాను చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారో అర్థం కావడం లేదని మహిళలు మండిపడుతున్నారు. జనాలను మద్యం మత్తులో ముంచేందుకు పడరాని పాట్లు పడుతున్నారంటున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు తమవైపు కన్నెత్తి కూడా చూడకుండా సదరు వైన్ షాప్ యాజమానులు వారిని మామూళ్ల మత్తులో ముంచెత్తుతున్నారన్న ఆరోపణలు స్థానిక ప్రజలు నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైన్, బెల్ట్ షాపుల ఉమ్మడి దందాను బద్దలు కొట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### దసరా వచ్చిందంటే..

దసరా పండుగ వచ్చిందంటే చాలు పోలీస్, ఎక్సైజ్ అధికారుల దందా మామూలుగా ఉండదని వైన్ షాప్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు ప్రతి ఒక్కరు దసరాకు ఏమీ లేదా అంటూ అందిన కాడికి దండుకునేందుకు వైన్ షాపుల మీద పడుతున్నారంటున్నారు. ఒక్కో పోలీస్ స్టేషన్ కు దసరా నజరానాగా కేసులకు కేసులు మద్యం పంపించాల్సి ఉంటుందని వాపోతున్నారు. పెద్ద మొత్తంలో వారు దోచుకుపోవడంతో మేము జనం దగ్గర దోచుకుంటున్నామంటూ వైన్ షాప్ యజమానులు చెప్పుకొస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా వైన్ షాపుల మీద పోలీస్, ఎక్సైజ్ అధికారులు పడడం మానుకుంటే ఆటోమెటిక్ గా మద్యం ధర దానంతట అదే దిగి వస్తుందంటున్నారు.



# పేదల సంక్షేమానికి పెద్ద పీట

- దసరాలోపు అర్హులందరికీ హెల్త్ కార్డ్, రేషన్ కార్డులు
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** దసరాలోపు అర్హులైన ప్రతీ కుటుంబానికి హెల్త్ కార్డ్, రేషన్ కార్డులు, పెన్షన్ అందించనున్నట్లు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఘన్ పూర్, చిల్పూర్, జఫర్గడ్, లింగాల ఘన్ పూర్ మండలాలకు చెందిన 71మంది లబ్ధిదారులకు రూ.19,54,500 విలువ కలిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఒక్క స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ల ద్వారా దాదాపు 1000మంది లబ్ధిదారులకు రూ.10కోట్ల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. దీన్ని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం విషయంలో ఎంత చిత్తశుద్ధితో పని చేస్తుందో అర్థం అవుతుందన్నారు. దసరా లోపు ప్రతీ కుటుంబానికి హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, పెన్షన్ లు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నియోజకవర్గానికి 3,500 నుంచి 5వేలకు పెంచిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కమిటీల ద్వారానే నిజమైన లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. కాంట్రాక్టర్లు లేకుండా నేరుగా లబ్ధిదారులకు మూడు విడతల్లో రూ.5 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒక సంవత్సరంలో 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణమఫీ జరిగిన దాఖలాలు లేవన్నారు. బీజేపీ నాయకులు సిగ్గులేకుండా ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి రైతులపై నిజంగా ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా రైతు రుణ మాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతీ ఒక్కరి కుటుంబాలాలో సంతోషాలు నింపాలని, శాంతులు నెలకొల్పలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేపల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ

- మత్స్య కార్మికులను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలో సమృద్ధిగా చెరువులు, కుంటలు, సరస్సులు ఉన్నాయని చేపల పెంపకానికి జిల్లా ప్రాంతం ఎంతగానో ఉపయోగపడుతుందని, మత్స్యకారులను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మత్స్యకారులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్య చరణతో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ముందుకు పోతున్నారన్నారు. శుక్రవారం ములుగు మండలం జాకారం గ్రామంలోని ఊర చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, మత్స్యకార సహకార సంఘాల సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ లతో కలిసి మంత్రి చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులో చేపలను పెంచడానికి చేప పిల్లలను ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా జరుపుతున్నదని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అధిక మొత్తంలో చేపల పెంపకం చేయడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేప పిల్లలను పంపిణీ చేసిందని అన్నారు. మత్స్యకారుల కోసం మండల, జిల్లా కేంద్రాల్లో భవన నిర్మాణాల కోసం ప్రణాళిక సిద్ధం చేశామని, చేపల వేట కోసం వెళ్లి మృత్యువాత పడిన మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటున్నదని అన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవడంలో విఫలమైందని, ముదిరాజులు రాజకీయంగా ఎదగడానికి ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయించి సభలకు పంపించిందని సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఎంపీడీవో రామకృష్ణ, మత్స్యశాఖ అధికారి అవినాష్, మత్స్యకార కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వర్తమాన రాజకీయాలపై సెమినార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పీడిత ప్రజా ప్రత్యామ్నాయమే ఫాసిస్టు కార్పొరేట్ ఆర్థిక విధానాలకు సరైన ప్రత్యామ్నాయమని రాజస్థాన్ కోటాలో జరుగుతున్న ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సమావేశం సందర్భంగా జరిగిన సెమినార్ లో ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ పిలుపునిచ్చారు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) ఎంసీపీఐయూ పోలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సమావేశం అక్టోబర్ 3, 4, 5 తేదీలలో రాజస్తాన్ కోటాలో జరుగుతున్న సందర్భంగా అక్టోబర్ 4న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ అనుభవ్ దాస్ శాస్త్రి అధ్యక్షతన వర్తమాన రాజకీయాలు, వామపక్ష కమ్యూనిస్టు ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అనే అంశంపై జరిగిన సెమినార్ జరిగింది. ఈ సెమినార్ లో ప్రధాన ఉపన్యాసకులుగా ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలలో ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ లో ఉద్యోగాలు చేసే వారు బహిరంగంగా పాల్గొనాలని, జమిలి ఎన్నికలు తెచ్చి ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే విద్య, ఒకే రకమైన ఆహర అలవాట్లు ఇంకా దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి, రాష్ట్రాల హక్కులను హరించే విధంగా జాతుల స్వయం పాలన విధానాన్ని హరించే కుట్రతో జమిలిగా ఎన్నికలను తెచ్చే విధంగా కేంద్ర క్యాబినెట్ లో ఆమోదించారని విమర్శించారు. కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ సీసీసీ మూడు రోజుల మీటింగ్ నవంబర్ 5, 6, 7 తేదీలలో హైదరాబాద్ లో జరుగుతున్న సందర్భంగా నవంబర్ విప్లవ వార్షికోత్సవ సందర్భంగా నవంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సెమినార్ ను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గం వరకు నిర్వహిస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ సెమినార్ లో ఎంసీపీఐయూ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ కిరణ్ జిత్ సింగ్ షేఖాన్, సీపీఐ రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తారాసింహ సింద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దూలిచంద్ బోర్దా, సీపీఐఎంఎల్ లిబరేషన్ రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ శంకర్ లాల్ చౌదరి, లోక్ తాంత్రిక్ బచావో ఆందోళన్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ చతుర్వేది, కిసాన్ సర్వోదయ్ మండలి రాజస్తాన్ రాష్ట్ర నాయకులు పతేహ చంద్ బాగ్లాతో పాటు రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి హేందర్ నేహా, ఎంసీపీఐయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వస్కుల మట్టయ్య, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, ఎండీ ఖాదర్ బాషా, బీహార్ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మోహన్ ప్రసాద్, పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి మంగత్ రాం లాంగో వాల్, కేరళ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి ఆహారంతోనే ఆరోగ్యం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మనం తీసుకునే ఆహారం పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని లోడీ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి అన్నారు. మిల్లెట్స్ పై గత కొన్ని సంవత్సరాలుగా త్రీనగరి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న " రికార్డ్ సర్వీస్ సొసైటీ "వారి ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం హనుమకొండ కుమార్ పల్లి మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన రికార్డ్ మిల్లెట్ హబ్ అవుట్ లెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలను ప్రతిరోజు మన ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన అన్నారు. నిర్వాహకులు మిల్లెట్ కల్టివేటర్ కుసుమ సురేష్, మిల్లెట్ కుకింగ్ ఎక్స్పెర్ట్ కుసుమ కవిత మాట్లాడుతూ ప్రజలకు చిరుధాన్యాల పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగా అందరికీ అందుబాటులో ఉండాలని ప్రారంభించిన ఈ విక్రయశాలలో అన్ని రకాల చిరుధాన్యాల ఉత్పత్తులు లభ్యమవుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోటర్ ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, కుసుమ రమేష్, ప్రకాష్, శ్రీ వాత్సవ్, శ్రీ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## బురద జల్లే రాజకీయాలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు పరిష్కరించడాన్ని ఓర్వ లేని ప్రతిపక్ష నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తూ పలు పత్రికలలో తప్పుడు కథనాలు రాయిస్తూ పబ్బం గడుపుతున్నారని నడి కూడ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ మండల పార్టీ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేసి ఇబ్బందులకు గురి చేస్తే చట్టం తన పని తాను చేసుకుంటుందని నడికూడ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పార్టీ నాయకులు నడికూడ మండల కేంద్రంలో గానీ,14 గ్రామాలలో గానీ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలాంటి పెత్తనాలు చేస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదనినారు. పాల్పడినట్టుగా ఎవరైనా రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకోవడానికి మండల పార్టీ నాయకులు సిద్ధమన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు.

## ఝాన్సీరెడ్డి క్షేమంగా ఉండాలని పూజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలో కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యాదృచ్ఛికంగా ప్రమాదానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న స్థానిక పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రజల మధ్యలోకి వచ్చి సేవలను పున ప్రారంభించాలని తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో స్థానిక రామలింగేశ్వరం స్వామి దేవస్థానంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కాసర్ల రంగయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తూరు మాజీ గ్రామ సర్పంచ్ మోత్కూరీ రవీంద్ర చారి, సీనియర్ నాయకులు కూతురు హరి మోహన్ రెడ్డి, కూతురు మోహన్ రెడ్డి, పంజాల సోమయ్య, పంజాల అశోక్, ఉమ్మగాని సత్యం, పంజాల శంకర్, ఏర్పుల సాగర్, గుడివాడ సోమన్న, పిల్లి ఐలయ్య, ఆవుల రవికుమార్, గుద్దేటి వెంకన్న, ముత్యం అన్వేష్, కూతురు వెంకట్ రెడ్డి, శామంతుల వీరన్న, గుర్రం ఉప్పలయ్య, కూరపాటి వెంకన్న, సింగారం వెంకటయ్య, పార్టీ యూత్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యను కలిసిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి దసరా వేడుకలు రావణాసుర వధ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు ఏర్పాట్లు వెంటనే చేయించవలసిందిగా ఎమ్మెల్సీని కోరారు. ఎమ్మెల్సీ సారయ్య వెంటనే స్పందించి ప్రభుత్వపరంగా తగిన ఏర్పాట్లు చేపిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితితో తనకు ఎనలేని బంధం ఉందని తెలియజేశారు. సారయ్యను కలిసిన వారిలో ఉత్సవ సమితి కన్వీనర్ భయ్యా స్వామి, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ , గుల్లపెల్లి రాజకుమార్, గోరంటల మనోహర్, గోరంట్ల రాజు, మార్త ఆంజనేయులు, రాచర్ల శ్రీనివాస్, సిద్దోజు శ్రీనివాస్, సిలువేరు థామస్, ఓం ప్రకాష్ కొలారియా, ఎరుకల రఘునారెడ్డి, గుర్రపు సత్యనారాయణ, కొరవి పరమేష్, వెలిశాల బాబు, రామ యాదగిరి, ములుక సురేష్, తోట బాలరాజు, సిద్ధం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని 2వ వార్డు ఒంటెరు దేవరాజు డీపీఓ ములుగు తండ్రి ఒంటెరు సారయ్య ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క హాజరై ఆ కుటుంబానికి సంతాపం తెలపడంతో పాటు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల టౌన్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ ఒంటేరు సారయ్య, 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాసరి భిక్షపతి, మాజీ ఎంపీపీ ఒంటేరు రాంమూర్తి, రాయపర్తి మాజీ ఎంపీటీసీ పర్నం మల్లారెడ్డి, మల్లక్కపేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, వెల్లంపెల్లి ఎంపీటీసీ కొత్తపెల్లి రవి, పరకాల పట్టణ మహిళా అధ్యక్షురాలు పసుల విజయ, మార్క అభినయ్ గౌడ్, సీనియర్ నాయకుడు మడికొండ శ్రీనివాస్, చందుపట్ల రాఘవరెడ్డి, ఎండీ అలీ, బొమ్మకంటి చంద్రమౌళి, ఉడుత సంపత్, బొచ్చు మోహన్, లక్కం శంకర్, మార్క కిరణ్, అల్లం శ్రీరాం, మడికొండ చంగల్, దొమ్మటి కృష్ణకాంత్, షఫీ, మచ్చ సుమన్, ఏకు రవికుమార్, బొచ్చు భాస్కర్, సీహెచ్ మొగిలి, ఇనగాల రమేష్, బొచ్చు మోహన్, అస్రాఫ్, పరకాల వివిధ వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎన్ఆర్కేఎస్ జిల్లా మహాసభ జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఎన్ఆర్కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) హనుమకొండ జిల్లా మహాసభ జయప్రదం చేయండని బీఎన్ఆర్కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంచార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ అడ్డా వద్దా శీలం ఆనందం అధ్యక్షుడి అధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంచార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్ పాల్గొని బీఎన్ఆర్కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) హనుమకొండ జిల్లా మహాసభ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) అనేక ఉద్యమాలు చేసి 1996 చట్టాన్ని సాధించిందని కానీ, చట్టం వచ్చినంత మాత్రాన కార్మికులు అభివృద్ధి చెందుతారని అనుకోవద్దన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి కార్మికుడికి అందాలంటే బీఎన్ ఆర్కేఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో నిరంతరం మన సంఘం గత 20 ఏళ్ల నుంచి పోరాటం చేస్తూనే ఉందని తెలిపారు. అలాగే, తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్నా, సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు, అప్పగించాలని ఈ ప్రభుత్వం చూస్తున్నదని, దీనిని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎన్ ఆర్కేఎస్ హనుమకొండ జిల్లా మహాసభ మడికొండ హైదరాబాద్ రోడ్డు పెట్రోల్ బంక్ పక్కన కరీష్మా గార్డెన్ లో జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిలుగా బీఎన్ఆర్కేఎస్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్న హాజరవుతారని తెలిపారు. జిల్లా మహసభ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ల్యాగాల సాంబయ్య, దాసు, వెంకటేష్, శ్రీశైలం, ఆంధ్ర మేస్త్రీ, చేరాలు పాల్గొన్నారు.

# 8న బీసీ లిటరరీ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలి




## వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ ప్రజా సంఘాలు పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 8న వరంగల్ లో జరిగే బీసీ లిటరరీ ఫెస్టివల్ ను రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ బీసీ ఫెస్టివల్ కు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ, ఓసీ అన్ని వర్గాల ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని బీసీ లిటరరీ ఫెస్ట్ కన్వీనర్ డా.చింతం ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఓబీసీ జాక్ అధ్యక్షుడు సాయిని నరేందర్ మాట్లాడుతూ ఇది బీసీల సమయమని, బీసీల కోసం అందరం మాట్లాడాల్సిన సందర్భమిదని ఆయన అన్నారు. ఇంతకాలం అందరి కోసం బీసీలు మాట్లాడారు. ఇప్పుడు అందరూ బీసీల కోసం మాట్లాడాలని, అందు కోసం బీసీ లిటరరీ ఫెస్టివల్ ఒక వేదిక కాబోతుందని, తెలంగాణ పూలే యువజన సంఘాల జాక్ అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి అమర్, దాసరి కిరణ్, ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు కెడెలా ప్రసాద్, కేయూ విద్యార్థి నాయకులు గొల్లపల్లి వీరస్వామి, పూలే యువజన నాయకులు నలుబాల రవికుమార్, అనిశెట్టి సాయి తేజ, మామిడి రాకేష్, సినీ డైరెక్టర్, రైటర్ రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

# కొండా సురేఖను విమర్శించే స్థాయి నరేందర్‌కు లేదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కొండా సురేఖను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే నరేందర్‌కు లేదని, తన వ్యాఖ్యలను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సోషల్ మీడియాలో ట్రోల్ చేసినందుకు గాంధీభవన్ లో గానీ, సీఎల్పీలో గానీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖ ఖండించారు. వరంగల్ లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మంత్రి కొండా సురేఖ పైన మాట్లాడుతూ వరంగల్ పరువు ప్రతిష్టలను దిగదార్చిందని అనడం సరికాదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అంటే రాణి రుద్రమదేవి సమ్మక్క సారలమ్మ చాకలి ఐలమ్మ వీరనారులు ఏలిన గడ్డ అని మీసాల ప్రకాష్ అన్నారు. కానీ, బీఆర్ఎస్ వారు మీరు మహిళలను గౌరవించి ఉంటే ఆనాడు ప్రభుత్వంలో పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్నారు. ఆనాడు మహిళలకు తెలంగాణ ప్రభుత్వంలో సముచిత స్థానం ఇవ్వలేదని తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పుడు మహిళల గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యేకు, బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి అయిందంటే కొండా దంపతుల వల్లనే అని ఒక్కసారి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జంగం ప్రభాకర్, పోలే పాక విశాల్ బాబు, కట్కూరి అన్వేష్, కొండమీది సదానందం, పప్పు వేణు, గూడ నవీన్, దౌడు నాగరాజ్, కోంక వెంకటేశ్వరరావు, శ్యామల మార్క్, ఓడపల్లి రవి, భిక్షపతి, కుమార్ స్వామి, జ్యోతి బస్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద, గూడ లావణ్య పాల్గొన్నారు.

# సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం బచ్చు సాకేత్ అనే యువ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బచ్చు సాకేత్, గత కొద్ది సంవత్సరాలుగా ఒక ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్నాడు. 2020 నుంచి 2024 వరకు ఇంటి వద్దనే ఉండి ఉద్యోగం చేస్తూ వచ్చాడు. ఏమైందో తెలియదు కానీ, శుక్రవారం ఉదయం సుమారు మూడు గంటల సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు. మృతుడికి ఒక తమ్ముడు ఉన్నాడు, మృతుడి తల్లిదండ్రులు చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే క్రమంలో అనుకోకుండా సాకేత్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నర్సంపేట మెడికల్ కాలేజీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

## కలెక్టర్‌ను కోరిన ప్రజా సంఘాల నాయకులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నర్సంపేటలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను స్థానికులకు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు పీడీఎస్ యూ, పీవైఎల్ పీఓడబ్ల్యూ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న స్వీపర్, అటెండర్, టెక్నీషియన్, ఏఎన్ఎం, జీఎన్ఎం, సూపర్ వైజర్, రిసెప్షనిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, స్థానికంగా ఉన్న దళిత కుటుంబాలకు చెందిన వారు పైన తెలిపిన పోస్టులకు అర్హులుగా ఉన్నందున వారికి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. నర్సంపేటలో కొంతమంది దళారులు ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసుకున్నారని, అమాయకులు ఆశతో డబ్బులు ఇచ్చి మోసపోయారని, ప్రస్తుతం అలా కాకుండా స్థానికులకు అవకాశం కల్పించాలని వారు జిల్లా కలెక్టర్ రాసిన వినతిపత్రంలో తెలిపారు. కలెక్టర్ అందుబాటులో లేనందున కలెక్టర్ ఆఫీస్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క, పీడీఎస్ యూ అధ్యక్షుడు అజయ్, గంధ్రతి హరిబాబు, రంజిత్, వీరన్న, సుకన్య, ప్రభావతి, రవళి, అఖిల, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మండల కేంద్రంలోని అయోధ్య గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ కొల సత్యం, బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు హెచ్.వెంకటేష్, మహబూబాబాద్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రామ్ ఆధ్వర్యంలో అలాగే గ్రామ అధ్యక్షుడు జినుక రవీందర్ అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, మాజీ సర్పంచ్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పండగ వేళ పస్తులేనా..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబర్ జీతం, 7 నెలల పెండింగ్ ఏరియర్స్ పెండింగ్ లో ఉన్నాయని, దసరా పండగ వేళలో జీతం ఇవ్వకపోతే ఉద్యోగులు పస్తులు ఉండాలా అని ఎన్ హెచ్ఎం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నూర సంపత్ కుమార్ ప్రశ్నించారు. ఉద్యోగులకు పస్తులు ఉండేలా చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగింది. ఈనెల 8నాటికి ఉద్యోగుల బ్యాంకు ఖాతాలో జీతాలు జమ చేయకపోతే 10వ తేదీ నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కు మెయిల్ ద్వారా తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు ప్రతీ నెల సక్రమంగా జీతాలు చెల్లించక పోవడం, ఉద్యోగుల కు రావలసిన బిల్లులు అన్ని పెండింగులో ఉండటం వల్ల ఉద్యోగుల చాలా ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగుల పాత్ర చాలా కీలకమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు అన్నింటిని పరిష్కారం చేస్తామని మేనిఫెస్టో లో పెట్టారు కానీ పట్టించుకోవడం లేదని ఐఎన్ టీయూసీ 3194 ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ అన్నారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ, దసరా సందర్భంగా ఉద్యోగులకు తీపి కబురు ప్రకటించాలని, ఉద్యోగుల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు

# మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహనగరంలో కాకతీయులచే కొలువబడిన భువనేశ్వరి సర్వేశ్వర స్వామి(రంగంపేట శివలయంలో) దేవీ శరన్నవరాత్రులలో భాగంగా రెండోవ రోజు అమ్మవారిని బ్రహ్మచారిణిగా అర్చన నిర్వహించి మహాలక్ష్మిగా అలంకరించి చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య దాతలుగా తంగెలపెల్లి విశ్వనాథం దంపతులు, కోట అభినయ్ దంపతులు పాల్గొన్నారు. శివాలయం చైర్మన్ మాదారపు సదాశివుడు, దేవాలయం అర్చకులు గోపికృష్ణ శర్మ, భక్తులందరూ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి శ్రీరామరక్ష

## కార్పొరేటర్ చెన్నం మధు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 6వ డివిజన్ బొక్కలగడ్డలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం నిర్వ హించే మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వారి సూచనలు, సలహాలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం అనంతరం బీపీ, షుగర్ పేషెంట్స్ కు టెస్టులు చేసి మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమంలో డాక్టర్ గీత, మెడికల్ ఆఫీసర్ బాజిలీ, సమ్మ హెచ్ వీ, ఏఎన్ఎం బి.సంధ్య, ఆశా వర్కర్లు రషీదా, యాదలక్ష్మి, మౌనిక, నర్వేందర్ కౌర్, అంగన్వాడీ టీచర్లు స్థానికులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని రెండవ వార్డ్ సీఎస్ఐ కాలనీలో కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వేను పరిశీలించారు. ఈ కార్డు ఆధారంగానే రేషన్ కార్డు, ప్రభుత్వం నుంచి ఏదైనా పథకాలు అందుకోవచ్చని, ఈ కార్డు చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో మొత్తం 12మందిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ఎం.ఏ షుకూర్ వెల్లడించారు. ఈ 12మందిని కోర్ట్ లో హాజరుపరచగా రూ.14,500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ విద్యాసాగర్ తీర్పునిచ్చారన్నారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 12మందికి రూ.9,500 జరిమానా విధించినట్లు సీఐ షుకూర్ పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ కేసులో దొరికిన 11మందిని ఒకరోజు సోషల్ సర్వీస్‌కు పంపించడం జరిగిందని సీఐ తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న భూపాలపల్లి జిల్లా కాశింపల్లి గ్రామానికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్, ఓనర్స్ పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను కొయ్యూరు పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## కాంగ్రెస్ నేత నూకల నరేశ్ రెడ్డి మృతి



**వరంగల్ వాయిస్, మరిపెడ/డోర్నకల్ :** డోర్నకల్ నియోజకవర్గ ప్రజల ప్రీతిపాత్రుడైన, రాజకీయ హృదయ నేత నూకల నరేష్ రెడ్డి(74) ఇక లేరు. గత 8 రోజులు క్రితం గుండె సంబంధిత వ్యాధికి గురై హైదరాబాద్ లోని నానక్ రాంగూడలోని స్టార్ హాస్పిటల్ లో చేరి చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందారు. సీఎంతో పాటు హరీష్ రావు, కేటీఆర్ లాంటి ముఖ్య నేతలు ఆయనను అసుపత్రిలో పరామర్శించారు. గుండెకు స్టంట్స్ వేసిన రెండు రోజులు కొంత మేర కోలుకున్న ఆయన శుక్రవారం మరో మారు తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయన మరణించిన విషయం మానుకోట, మరిపెడ, వరంగల్, ఖమ్మం జిల్లా ప్రజలు జీర్ణంచికోలేకపోతున్నారు. ఎన్ఎన్ఆర్ భౌతికాయాన్ని మరిపెడ మండల పురుశోత్తమయిగూడానికి శనివారం ఉదయం తీసుకోచ్చి ఆయన తోటలో దహన సంస్కరాలు చేయనున్నారు.

## మానవత్వం చాటుకున్న డాక్టర్లు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మానవత్వమున్న రేగొండ వైద్యులు తామున్నామంటూ ముందుకు వచ్చి నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. వివరాల్లోకి వెళితే రేగొండ మండలం చెంచుపల్లి గ్రామానికి చెందిన బండి సరిత భర్త నెల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా భర్త మృతితో సరిత కుటుంబం అనాథగా మారింది. వారికి ఆరుగురు పిల్లలు ఉండగా మళ్లీ గర్భంతో ఉందనే విషయం తెలుసుకున్న రేగొండ ప్రాథమిక ఆరోగ్య డాక్టర్ హిమబిందు చెంచుపల్లి గ్రామాన్ని సందర్శించి సరిత కుటుంబనీకి అండగా నిలిచింది. శుక్రవారం ఒక క్వింటా బియ్యం, నెల సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లింగారెడ్డి, డాక్టర్స్ విష్ణువర్ధన్, రూపేష్, చందన, అస్మా, రమ్యశ్రీ, సూపర్ వైజర్స్ సుధ, రాము, వినోదలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ రవీందర్, ప్రేమ్ కుమార్, రామారావు, వేణుగోపాల్ రెడ్డి, ఏఎన్ఎంలు వసంత, సుగుణ, రమా, శాంతా, కళాప్రియ, లత, జోత్స్న, సదాలక్ష్మి, యాదలక్ష్మి, రాధిక, దినా, సులక్షణ పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూముల కాపాడాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడా బాబుల, కబ్జాకోరుల మధ్య అన్యాక్రాంతమైన, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పేద ప్రజల ఇండ్ల స్థలాలకు ఇవ్వాలని, అదేవిధంగా కబ్జా కోరులపై, వారికి సహకరించిన సంబధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రే భిక్షపతి మాట్లాడుతూ హనుమకొండలోని హంటర్ రోడ్ సైన్స్ సెంటర్ ప్రాంతంలోని సర్వే నెంబర్ 964, 966లో ఉన్న 49 ఎకరాల ప్రభుత్వ భూమిలో 10ఎకరాలకు పైగా కబ్జాకోరులు అన్యాక్రాంతం చేశారని, బడా నేతల కనుసన్నలోనే ఈ భూమి కబ్జాకు గురై నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, సంబంధిత రెవెన్యూ, మున్సిపాలిటీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ భూ కబ్జాలు జరిపి నిర్మాణాలు జరిగాయని కలెక్టర్ కు తెలిపారు. అన్యాక్రాంతమైన భూమిలో నిర్మాణాలు చేసినటువంటి భూమితో పాటు మిగులు ఖాళీగా ఉన్న సుమారుగా 49 ఎకరాల భూమిని ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంచి ఇవ్వాలని, అదేవిధంగా కబ్జా కోరులపై, నిర్లక్ష్యంగా వ్యహరించిన అధికారులు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అట్టి భూమిని గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, హనుమకొండ మండల కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, సీపీఐ జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, కొట్టే వెంకటేష్, మాలోత్ శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రావిరాల గ్రామంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షెఫర్డ్, శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పిటల్, బేరా సొసైటీ ప్రతినిధులు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్, శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పిటల్ బేరా సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గత కొన్ని రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా భారీ వర్షాలతో అతలాకుతలం కావడంతో నిరాశ్రయులైన రావిరాల గ్రామానికి తమవంతుగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ షెఫర్డ్, శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పటల్ బేరా సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 800 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, పిల్లలకు మహిళలకు న్యూట్రిషన్ కిడ్స్ అందించారు. లయన్స్ క్లబ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ లయన్ రొయ్యూరు సురేష్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మహబూబాబాద్ జిల్లాని వర్షం అన్ని విధాలుగా నష్టం చేసింది. రావిరాల గ్రామంలో చెరువు కట్ట తెగి, ఇండ్లు నీట మునిగి ఆస్తి నష్టం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వారిని ఆదుకోవాలని, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ ఆధ్వర్యంలో మేము మా వంతుగా రావిరాల గ్రామానికి ఎంతోకొంత మేలు చేయాలనే ఉద్దేశంతో ఈ నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమం, విద్యార్థినీ విద్యార్థులకు న్యూట్రిషన్ కిడ్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ సెక్రటరీ, శ్రీ సత్య చారిటబుల్ కంటి హాస్పిటల్, బేరా సొసైటీ చైర్మన్ లయన్ డాక్టర్ ధారావత్ రెడ్డి నాయక్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం రావిరాల గ్రామానికి, చాలా నష్టం వాటిల్లింది. అది తెలుసుకొని మేము మా వంతుగా సహాయం చేయడానికి మాకు అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ లయన్ డాక్టర్ రొయ్యూరు సురేష్, లయన్ డాక్టర్ ధారావత్ రెడ్డి నాయక్, బేరా సొసైటీ ప్రతినిధులు, సంపత్, రమేష్, శీను, రావిరాల గ్రామ నాయకులు, నెల్లికుదురు మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ములుగు రోడ్డులోని రామప్ప జూనియర్ కాలేజీలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ (సీఆర్ఎస్ బీ) ఇన్ స్పెక్టర్ బి.శ్రీనివాస రావు రోడ్డు ట్రాఫిక్ నియమాల గురించి, నియమాలు ఉల్లంఘిస్తే ట్రాఫిక్ పోలీసులు విధించే చలాన్ల గురించి, ట్రాఫిక్ ఉల్లంఘన వల్ల జరిగే అనర్థాల గురించి క్లుప్తంగా వివరించారు. ఇంకా వరంగల్ కమిషనరేట్ లో ప్రతి నెలా జరిగే రోడ్డు ప్రమాదాలు, అవి జరగడానికి గల కారణాలు, అవి జరగకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్ ఎవరూ చేయకూడదని, 18 సంవత్సరాలు నిండిన వారందరూ డ్రైవింగ్ లైసెన్స్ కొరకు అప్లై చేసుకోవాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ (సీఆర్ఎస్ బీ) ఇన్ స్పెక్టర్ బి.శ్రీనివాస రావు, సిబ్బంది ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఏఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజు, రామప్ప కాలేజి ఇంచార్జి కమల్, 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు కళాశాలలోని వాహనాలు నడుపు డ్రైవర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన గిరుగుల సునీత పాణి దంపతులకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైన సంఘటనతో బాధితులు కట్టుబట్టలతో ఉండిపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంఘటన విషయాన్ని అందుకున్న స్థానిక తహసీల్దార్ శ్వేతారావు శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితులు సునీత పాణి దంపతులు వ్యవసాయ పనుల మీద బయటకి వెళ్లగా ఇంట్లో ఒకసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సంఘటన విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ శ్వేతారావు తన సిబ్బందితో దగ్ధమైన ఇల్లును సందర్శించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్వో సంఘటన వివరాలను అడిగి తెలుసుకోగా, ఇంట్లోనీ ఫర్నిచర్, నిత్యావసర సరుకులతో పాటు నగదు రూ.70 వేలు, తులం బంగారం, ఫ్రిడ్జి, కూలర్, టేకు కలపతో నిర్మించిన, దర్వాజాలు కిటికీలుతో సహా షార్ట్ సర్క్యూట్ కు పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో భార్య భర్తలు ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఈ ఘటన వివరాలను తహసీల్దార్ నమోదు చేసుకుని బాధితుల కుటుంబానికి భరోసా కల్పిస్తూ తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి సహాయం అందేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు. రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (ఆర్ఐ) జూపాక నరేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ గడ్డం శ్రీకాంత్, డీలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా చేప పిల్లల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలనే ఉద్దేశ్యంతో చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాజీపేట ఫాతిమానగర్ వడ్డేపల్లి పెద్ద చెరువులో జిల్లా మత్స్యకారుల శాఖ అధికారులతో కలిసి చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2024-25 సంవత్సరాని గాను 13.19 లక్షల చేప పిల్లలను 100 శాతం సబ్సిడీపై సరఫరా చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 5 మత్స్యకార సహకార సంఘాల సొసైటీలు ఉన్నాయని, నేడు వడ్డేపల్లి పరిధిలోని 4 చెరువులలో 4.38లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఏటా అక్టోబర్ మాసంలో చేప పిల్లలను పంపిణి చేయడం జరుగుతుందని, గతంలో మహానగరంలో సుమారు 700ల చెరువులలో పంపిణీ చేసే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 811 చెరువులలో పంపిణీకి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, హైదరాబాద్ లాంటి మహానగరంలో ఇప్పటికే ఆక్రమిత చెరువులు, కుంటలపై హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణ జరుగుతున్న విషయం గుర్తు చేశారు. రెండవ అతిపెద్ద నగరమైన వరంగల్ లో కూడా రెవిన్యూ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. చెరువులు అనగానే కాకతీయుల నాటి ఆనవాళ్లకు ప్రతీక అని ప్రజలందరూ సహకరిస్తే చెరువులు, కుంటలకు తిరిగి పునర్ వైభవం వస్తుందని కోరారు. చేప పిల్లల పెంపకానికి ఉత్సహవంతులకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. మత్స్యకార సొసైటీ సభ్యులు కూడా చెరువుల పరిరక్షణలో తమ వంతు భాధ్యత నిర్వర్తించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గజపాక రమేష్, సుధాకర్, పున్నం చందర్, మాజీ కార్పొరేటర్లు చుంచు అశోక్, నాగరాజు, మత్స్యశాఖ సహకార సంఘాల నాయకులు నర్సింగ్, కోటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగరిక రమాకాంత్, లక్ష్మణ్, రమేష్, మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ చైర్మన్ దారబోయిన ప్రణయ్ దీప్, వైస్ చైర్మన్ సిరబోయిన్ సతీష్, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకట్, అడిషన్ కలెక్టర్ వెంకట్ రామ్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శంకర్ రాథోడ్, జిల్లా మత్స్యశాఖ సంక్షేమ అధికారి నాగమణి, జిల్లా మత్స్యశాఖ సంఘాల ప్రమోటర్ బుస్స మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు బహుమతుల అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హనుమకొండ డిపో పరిధిలో నడుస్తున్న హనుమకొండ నుంచి హైదరాబాద్ కు డీలక్స్ బస్సులలో మహిళా ప్రయాణికులకు హనుమకొండ బస్టాండ్ ప్రాంగణంలో శుక్రవారం రీజినల్ మేనేజర్ విజయ భాను చేతుల మీదుగా లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ విజయ భాను మాట్లాడుతూ మహిళలు డీలక్స్ బస్సులలో ప్రయాణం చేసి సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరుకొని లక్కీ డ్రాలో బహుమతులను గెలుచుకోగలరని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలు వి.రత్న, హనుమకొండ నివాసి, పి.పద్మ, పిల్లమర్రి నివాసి, బి.అనుష, కుందారం నివాసి బహుమతులు అందుకున్నారు. అనంతరం డిపో మేనేజర్ బి.ధరమ్ సింగ్ మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో ప్రత్యేక గిఫ్ట్ బాక్స్‌లను ఏర్పాటు చేశామని, మహిళా ప్రయాణికులు బస్సు దిగేముందు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి డ్రా నిర్వహించి, గెలుపొందిన మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) సరస్వతి, అసిస్టెంట్ ఇంజనీర్ వి.చంద్ర శేఖర్, కేవీ రెడ్డి, సిబ్బంది బస్టాండ్ లోని ప్రయాణికులు పాల్గొన్నారు.

# గౌడన్నలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, మరిపెడ:** కల్లు గీత కార్మికుల కు కాంగ్రెస్ ప్రభుత్వం అండ గా ఉంటుందని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ లు అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో రాష్ట్రంలోని కల్లు గీత కార్మికుల రక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కిట్ లను ఏర్పాటు చేయించి గౌడన్నలకు కాటమయ్య రక్షణ కవచాలను మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్ రామచంద్ర నాయక్ పంపిణీ చేశారు. కల్లుగీత కార్మికుల ప్రాణాలకు అభయ హస్తం కాటమయ్య రక్షణ కవచమన్నారు. హైదరాబాద్ ఐఐటీ ప్రత్యేకంగా ఈ కిట్ల రూపకల్పన చేసిందని ఆయన తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖల ద్వారా తెలంగాణ కల్లు గీత కార్మికుల సహకార ఆర్థిక సంఘం, హైదరాబాద్ సహకారంతో సేఫ్టీ కిట్లను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు, రాంలాల్, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ మాదిగ



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్ లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి 11,062 టీచర్ పోస్టులను ఎస్సీ వర్గీకరణ లేకుండా అమలు చేయడం మాదిగ జాతికి నమ్మిక ద్రోహం చేయడమే అవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం న్యూ శాయంపేటలో జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ “ మాదిగల పట్ల రేవంత్ రెడ్డి వైఖరి నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించినట్లు ఉందన్నారు. త్యాగాలు చేసి ముప్పై ఏళ్ళ పోరాటం ద్వారా సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణను సాధించుకుంటే ఆ ఫలాలు మాదిగలకు అందకుండా రేవంత్ రెడ్డి కుట్ర చేయడం దారుణమన్నారు. మాల నాయకుల బ్లాక్ మెయిల్ కు రేవంత్ రెడ్డి భయపడుతున్నారని తెలిపారు. ఇంత అత్యవసరంగా టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ లోని మాల నాయకుల ఒత్తిడి మేరకు ఎస్సీ టీచర్ పోస్టులన్ని మాలలకు దోచిపెట్టడానికి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నాడని అన్నారు. దీనికి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని ఎదుర్కోవడానికి మాదిగ విద్యార్థులు , నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 9 న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు నల్ల జెండాలతో భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బొక్కల నారాయణ మాదిగ, గంగరాపు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు రాజారాపు భిక్షపతి మాదిగ, ఎంవైఎస్ జాతీయ నాయకులు చేతాళ్ల శివ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలను చల్లగా చూడు దుర్గమ్మ తల్లి

## మాజీ ఉప సర్పంచ్ కుక్కల భిక్షపతి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** పాడి పంటలు, గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, దీనికి మీ దీవెనలు ఉండాలని దుర్గమ్మ తల్లిని గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుక్కల భిక్షపతి వేడుకున్నారు. యువ చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన దుర్గమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తహరాపూర్ గ్రామంలో దుర్గామాత ఉత్సవాలను ప్రతి ఏటా యువ చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన వంతుగా యువ చైతన్య గ్రూప్ కు రూ.40వేల విలువగల ఆమ్ప్లిఫైర్, సౌండ్ బాక్సులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిన్న రాజేందర్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రేణికుంట్ల సదయ్య, మాజీ ఎంపీటీసీ నిమ్మల రమేష్, పున్నం పురుషోత్తం రెడ్డి, పూజారి కొమురయ్య, బండారి పైడి, చందనాల సునీల్, రావుల శ్రీనివాస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌పై విమర్శలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** గత రెండు రోజులుగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ తోటి మహిళలను అని కుడా చూడకుండా చేస్తున్న విమర్శలు చాలా బాధాకారమని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళగా, మహిళా మంత్రిగా మాట్లాడిన మాటలను మహిళా లోకం ఖండిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పై, కేసీఆర్, కేటీఆర్ ల పై విమర్శలు మానుకొని ప్రజాపాలన చేపట్టాలని హితవు పలికారు. నీకు రాజకీయ భిక్ష పెట్టి ఎమ్మెల్యేను చేసిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని గుర్తు చేశారు. మహిళా మంత్రిగా మహిళలకు బతుకమ్మ కానుకలు అందించేందుకు కృషి చేయాలి తప్ప మహిళలను అవహేళన చేయడం సబబు కాదన్నారు. ఇంకా, ఎప్పుడైనా మహిళల పట్ల ఇలా మాట్లాడితే మహిళల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు మానుకోండి

## టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** నీకు రాజకీయ భిక్ష పెట్టి ఎమ్మెల్యే కూడా గెలవని నిన్ను ఎమ్మెల్యేను చేసిందే కేసీఆర్ అని వారిపై విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. శనివారం మండల కేంద్రంలో శివ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ అధినేత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని, బతికే ఉన్నాడా అని అనడం ఎంతవరకు సమంజసం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. రాజకీయ భిక్ష పెట్టిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని, టీఆర్ఎస్ నుంచి 2014 లో ఎమ్మెల్యే గా గెలిపించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ఆ విధంగా చేయకుండా ఉన్నట్లయితే ఎప్పుడో రాజకీయ సన్యాసం తీసుకుని ఉండేదని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేయాలని కేసీఆర్, కేటీఆర్ పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఇంకోసారి ఇలాంటి విమర్శలు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికెళ్ల ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్, శాయంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు గాజె రాజేందర్, మండల నాయకులు కుతాటి రమేష్, నమిత బాజీ, అశోక్, మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల వీరయ్య, యూత్ జిల్లా నాయకులు అరికిల్ల వెంకట్, నాయకులు దూదిపాల రాజిరెడ్డి, మారపల్లి క్రాంతి (లడ్డు) తదితరులు పాల్గొన్నారు.

# నటుడు మోహన్‌రాజ్ కన్నుమూత



దక్షిణాదికి చెందిన ప్రముఖ సినీనటుడు మోహన్ రాజ్ (72) కన్నుమూశారు. తెలుగుతోపాటు మలయాళం, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ ఆయన నటించి మెప్పించారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో తుదిశ్వాస విడిచారు. నటుడు, దర్శకుడు దినేశ్ పనికర్ ఈ విషయాన్ని తెలియజేశారు. మోహన్‌రాజ్‌కు భార్య ఉష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోహన్‌రాజ్ గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న మోహన్‌రాజ్‌ను వెంటిలేటర్ పై ఉంచారు. పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో మోహన్‌రాజ్ ఎక్కువగా విలన్ పాత్రలనే చేశారు. తెలుగులో లారీ డ్రైవర్, శివయ్య అసెంబ్లీ రౌడీ, సమరసింహారెడ్డి చెన్నకేశవ రెడ్డి, తదితర సినిమాల్లో విలన్ పాత్రల్లో కనిపించారు. మోహన్ రాజ్ దాదాపు 300లకుపైగా సినిమాల్లో నటించారు. మోహన్‌రాజ్ మృతి పట్ల కేరళ సీఎం పినరయి విజయన్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ సంతాపం తెలిపారు.

పలువురు సినీప్రముఖులు మోహన్‌రాజ్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కాగా, మోహన్‌రాజ్.. కిరిక్కాడాన్ జోస్ పేరుతో మలయాళంలో వందల చిత్రాల్లో నటించి మెప్పించారు. 1089లో సిబి మలయిల్ దర్శకత్వంలో వచ్చిన కిరీదామ్ సినిమాతో మంచి పేరు తెచ్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేసే మోహన్ రాజ్.. సినిమాలపై మక్కువతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. మూన్నం మూర చిత్రంలో మోహన్‌రాజ్‌నటించారు. ఆ సినిమాలో మోహన్ రాజ్ నటనను చూసిన సిబిమలయిల్.. తన సినిమాలో విలన్ పాత్రకు ఎంపిక చేశారు. ఆయన అంచనాలను నిజం చేస్తూ తన నటనతో ఎంతో ఎత్తుకు ఎదిగారు మోహన్ రాజ్. ఆ తర్వాత మలయాళంతోపాటు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మోహన్ లాల్ నటించిన కిరీడమ్ చిత్రంలో కీరిక్కడన్ జోస్ గా విలన్ పాత్రలో కనిపించిన మోహన్ రాజ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మూడు దశాబ్దాలపాటు ఆయన సినిమారంగంలో అనేక పాత్రలు పోషించి చెరగని ముద్ర వేశారు. కాగా, తెలుగులో మోహన్ రాజ్ నటించిన చివరి చిత్రం శివశంకర్. మోహన్ బాబు కథానాయకుడిగా రూపొందిన సినిమా ఇది.



# మరోసారి ఆమెనే..



రవితేజ కథనాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. అయితే యాక్షన్ సన్నివేశాల షూటింగ్ కారణంగా రవితేజ గాయపడటంతో తాత్కాలికంగా షూటింగ్ ఆపేసిన విషయం తెలిసిందే. తాజాగా రవితేజ కోలుకోవడంతో మళ్లీ తిరిగి షూటింగ్ ప్రారంభానికి యూనిట్ సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా ఈనెల 14 నుంచి కొత్త షెడ్యూల్ మొదలవుతుందని సమాచారం. సుదీర్ఘంగా సాగే షెడ్యూల్ ఇది. ఇందులో కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటు టాకీ పార్టు చిత్రీకరణ ఉంటుందని సమాచారం. ప్రేక్షకాభిమానులకు మంచి కిక్కిచ్చే రవితేజ మార్క్ సన్నివేశాలు కొన్ని చిత్రీకరిస్తారుట. అనంతరం సినిమాకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఇవ్వబోతున్నారుట. అది టీజర్ అవ్వొచ్చని గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. మరి అది టీజరా? లేక ఇంకేదైనా వినూత్నంగా ప్లాన్ చేస్తున్నారా? అన్నది తెలియాలి. ఇందులో రవితేజకు జోడీగా శ్రీలీల నటిస్తోంది. ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఉన్నా? కెమిస్ట్రీ సూపర్ అని ధమాకా చిత్రం ప్రూవ్ అయింది. అందుకే రాజా మరోసారి ఆమెనే హీరోయిన్ గా తీసుకున్నారు. పైగా ధమాకా మంచి విజయం సాధించిన చిత్రం. ఆ తర్వాత నటించిన చిత్రాలన్ని ఫ్లాప్ అయ్యాయి. అలా రాజాకి శ్రీలీల ఎంట్రీ అన్నది చిన్న సెంటిమెంట్ గా కూడా కలిసొచ్చింది. ఇందులో రవితేజ ఆర్పీఎఫ్ అధికారి పాత్ర పోషిస్తున్నాడు. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



# విజయ్ ఆఖరి చిత్రం



మిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా భావిస్తున్నచిత్రం **'తలపతి 69'** ఈ చిత్రంలో తలపతి విజయ్ హీరోగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు హెచ్ వినోత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం పట్ల అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనడం విశేషం. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. అలాగే మలయాళ సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన మమతా బాయిజు కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటులు ప్రకాష్ రాజ్, ప్రియమణి, నరేన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ మరియు బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ వంటి సీనియర్ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. విజయ్ మరియు అనిరుధ్ కాంబినేషన్ గతంలో పలు విజయాలను అందించినందున, ఈసారి మళ్లీ మాజిక్ చేసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. **'తలపతి 69'** చిత్రం పూజా కార్యక్రమం గ్రాండ్‌గా జరగగా, ఇందులో విజయ్, హెచ్ వినోత్ మరియు మిగతా తారాగణం హాజరయ్యారు. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడిరచింది. విజయ్ అభిమానులకు ఈ చిత్రం పండగలాంటిదిగా భావిస్తారు, మరియు ఇది విజయ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని నమ్మకంగా భావిస్తున్నారు.

# కరెక్ట్ గా తన పెళ్లి ముహూర్తానికి

## తల్లయిన హీరోయిన్ చిత్ర శుక్లా

టాలీవుడ్ స్టార్స్ చాలామంది ఇటీవల కాలంలో తల్లిదండ్రులయిన విషయం తెలిసిందే. నిన్న మొన్నటిదాకా వరుసగా టాలీవుడ్ లో పెళ్లి బాజాలు మోగగా, ఇప్పుడేమో వరుసగా పేరెంట్స్ అవుతూ వార్తల్లో నిలుస్తున్నారు పలువురు సెలబ్రిటీ కపుల్స్. తాజాగా తెలుగులో పలు సినిమాల్లో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ చిత్ర శుక్లా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అది కూడా కరెక్ట్ గా తన పెళ్లి ముహూర్తానికి గుడ్ న్యూస్ అందింది అంటూ సోషల్ మీడియా వేదికగా ఈ శుభవార్తను అభిమానులతో పంచుకుంది. హీరోయిన్ చిత్రా శుక్లా సోషల్ మీడియా వేదికగా తను పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది అన్న విషయాన్ని పోస్ట్ చేసింది. నాలుగు రోజుల క్రితమే అంటే సెప్టెంబర్ 30న రాత్రి 9:31 తనకు బిడ్డ పుట్టాడని వెల్లడిరచిన బ్యూటీ, ఇదే ముహూర్తానికి తమకు పెళ్లి జరిగిందని, ఇప్పుడు అదే ముహూర్తానికి బాబు పుట్టడంతో ఆ టైమ్ అనేది తనకు మరింత స్పెషల్ గా మారింది అంటూ ఇంస్టాగ్రామ్ లో తన న్యూ బార్న్ బేబీ ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోలో అప్పుడే పుట్టిన చిత్రా శుక్లా వారసుడు చూడడానికి క్యూట్ గా ఉన్నాడు. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ బ్యూటీ 2023 డిసెంబర్ లో వైభవ్ ఉపాధ్యాయ అనే పోలీసు అధికారిని పెళ్లాడిరది. ఇప్పుడు మగ బిడ్డని ప్రసవించి, ఆ ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ కొడుకు ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో అభిమానులు ఈ సెలబ్రిటీ కపుల్ పేరెంట్స్ గా మారినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా చిత్రా శుక్లా ఇండోర్ కు చెందిన అమ్మాయి. 2014 నుంచి ఈ బ్యూటీ సినిమాలు చేస్తూ వస్తోంది.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, అక్టోబర్ 04, 2024

# 301 పోస్టులు..903మంది అభ్యర్థులు

- 15 బృందాల ద్వారా ధ్రువపత్రాల పరిశీలన
- పారదర్శకంగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** డీఎస్సీ ఉత్తీర్ణత సాధించి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సజావుగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక డైట్ కళాశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఎంతమంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు, ఏ ఏ అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు, ఒక్కొక్కరికి ఎంత సమయం పడుతున్నదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సమాచారం అందించి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఈ పరిశీలన ప్రక్రియ ఈనెల 5వ తేదీలోపు పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 301 పోస్టులకు గాను 903 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను 15 బృందాల ద్వారా ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ కలెక్టర్ కు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి...**

రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. శుక్రవారం వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ కుటుంబ సర్వేను ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడకూడదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండలంలో వరి పంటను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట ఏ దశలో ఉంది..ఎప్పటిలోగా వరి కోతకు రావచ్చు అనే విషయంపై వ్యవసాయ రైతును ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తహసిల్దార్ విజయ సాగర్, మునిసిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మచారిణి అలంకరణలో అమ్మవారు

### రెండో రోజుకు చేరిన దేవి శరన్నవరాత్రులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రులు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం బ్రహ్మచారిణి, సాయంకాలం దేవజా దుర్గా క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఉదయం మకర వాహన సేవ, సాయంకాలం చంద్రప్రభ వాహన సేవపై ఊరేగించారు. కాగా తొగుట ఆశ్రమం పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామివారు దేవాలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన స్వామి వారికి దేవాలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభం, మంగళ వాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ మాధవానంద సరస్వతి స్వామి అమ్మవారి పూజానంతరం దేవాలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి తమ అనుగ్రహ భాషణం చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, నన్నపూనేని నరేందర్ దర్శించుకున్నారు.

**హనుమద్గిరిలో..**

శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం నవకలశాభిషేకం జరిగింది. రెండో రోజు బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నీలారపు రాజ్ కుమార్, కనుకుంట్ల రవికుమార్, మాదాసు మొగులయ్య, పద్మాక్షి పరపతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఫిల్టర్ బెడ్ లో మేయర్ ఆకస్మిక తనిఖీ

**అవాంతరాలు లేకుండా నీటిని సరఫరా చేయాలంటూ సూచన**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ ను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, నీటి సరఫరా తీరు, నీటి నాణ్యత నిర్ధారణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధర్మసాగర్ నుంచి వచ్చే నీటిలో (రా వాటర్) మలినాలు తొలగించడానికి అందులో కలిపే రసాయనాలపై వాకబ్ చేశారు. నీటిలో మురికి సాంద్రత పెరిగినందున ఆలంతో పాటు క్లోరిన్ డోసు పెంచి శుద్ధీకరించాలని, నీటి నాణ్యత ఆధారంగా కార్బన్ ను జత చేయాలని మేయర్ సూచించారు. ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు లైసెన్సులు

- సీపీ అంబర్ కిషోర్ ఝా చేతులమీదుగా పంపిణీ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** సుదీర్ఘ కాలంగా లైసెన్స్ లేకుండానే ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతులమీదుగా 35మందికి లర్నింగ్ లైసెన్స్ లు అందజేశారు. కొద్ది రోజుల క్రితం ఆటో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో లైసెన్స్ లేని వారికి లైసెన్స్ ఇప్పించాల్సిందిగా ఆటో డ్రైవర్లు కోరారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు, ఆటో డ్రైవర్లను సమన్వయం చేసుకుంటూ, లైసెన్స్ కు కావల్సిన దస్త్రాలను సమకూర్చి ఆటో డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేయడంలో కృషి చేసిన ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగబాబు, ఎస్.ఐ ఉమాకాంత్ తో పాటు సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. రానున్న రోజుల్లో వరంగల్, హనుమకొండ పరిధిలోని లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లకు సైతం లైసెన్సులు అందజేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## వీరస్వామికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అభ్యుదయ కవి, విమర్శకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్వీ సత్యనారాయణ రచనలు-పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ బన్నా అయిలయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసిన మాతంగి వీరస్వామికి కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మాతంగి వీరస్వామి 1987లో జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం హైదరాబాద్ రేంజ్ డీఐజీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన వీరస్వామి ఉద్యోగంలో చేరిన తర్వాతనే డిగ్రీ, పీజీ, ఎక్స్ టర్నల్ విధానంలో కాకతీయ విశ్వవిదయాలయంలోనే పూర్తి చేశారు.

## యువత సాధికారతే లక్ష్యం

- వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు
- వాగ్దేవిలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్'ప్రారంభం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో శుక్రవారం ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్, ఐసీటీ అకాడమీ నుంచి టీమ్‌వర్క్‌తో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్'ని ప్రారంభించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చివరి సంవత్సరం విద్యార్థుల కోసం 'ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ'ని స్పాన్సర్ చేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం.శశిధర్ హాజరయ్యారు. ఇది సెప్టెంబర్ 9, 2024న ప్రారంభించబడిందని, విద్యార్థులు తమ శిక్షణను గత 18 రోజులపాటు 124 గంటల్లో ముగించారని వైస్ ప్రిన్సిపాల్ చెప్పారు. ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ ఇంటరాక్షన్ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజు చింతకింది మాట్లాడుతూ విద్యార్థులు ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, నాలెడ్జ్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (కేపీఓ) రంగాల్లో ఉపాధి నైపుణ్యాలను పొందేలా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం జాబ్ మార్కెట్ డిమాండ్‌లను తీర్చడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిపుణుడు మల్లికార్జున్ అప్పాని విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ టెక్నాలజీలో 124 గంటల పాటు పాఠశాలను పూర్తి చేసేలా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు డేటా అనలిస్ట్ అసోసియేట్‌లు, పీఎల్ 300 సర్టిఫైడ్ ఇంజనీర్లుగా మారడానికి ఈ శిక్షణ రూపొందించబడిందని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత, ఇన్ఫోసిస్ మరియు ఐసీటీ అకాడమీ సంయుక్తంగా అసెస్‌మెంట్‌లు పూర్తి చేసిన విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్‌ను అందజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జె.స్రవంతి, ఎ.ఐసీటీఏ సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఎండి.గౌస్ పాషా, ఎంపికైన 68 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com